ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



8వ వార్డులో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్: పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను మేడ్చల్ పట్టణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. గురువారం పట్టణంలోని 1,8 వార్డులలో ఆమె పర్యటించి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సర్వేను పటిష్ఠంగా నిర్వహించి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అదనపు కలెక్టర్‌తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ చాపరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం.. జర భద్రం



శామీర్‌పేట - ఉషార్‌పల్లి రోడ్డులో ధాన్యం కుప్పలు

శామీర్‌పేట్: రోడ్డు పై ధాన్యం ఆరబోస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కోతల అనంతరం ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కల్లాలు లేక రైతులు రోడ్ల పై ఆరబెడుతున్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ఉషార్‌పల్లి–శామీర్‌పేట రోడ్డులో రైతులు చాలా చోట్లు ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. రాత్రి వేళల్లో ధాన్యాన్ని రోడ్డు పైనే కుప్పలుగా పోసి, వాటిపై నల్లటి కవర్ కప్పడంతో చీకట్లో వాహనదారులకు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహదారులకు ఈ కుప్పలు కనపడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు, చైర్‌పర్సన్ పావనీజంగయ్య తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్లు అనురాధా, నాగజ్యోతి, తహసీల్దార్ రజని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి, కీసర మండల తహసీల్దార్లు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మాలల ముందస్తు అరెస్ట్



శామీర్‌పేట్: మాల మహానాడు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పలువురు మాలమహానాడు నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ.. అరెస్ట్‌లతో తమ ఉద్యమాన్ని అనచివేయలేరని, ప్రభుత్వ ధోరణిని మార్చుకోవాలని హెచ్చరించారు. మాలమహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, శామీర్‌పేట మండల అధ్యక్షుడు బొమ్మెర్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలేష్, నరేష్, సుధాకర్, కాళిదాస్, ప్రకాష్, భరత్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జవహర్‌నగర్: క్రాంతి కళా బృందం వ్యవస్థాపకులు వెంకటాచారి ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో మత్తును పారదోలి.. ఎంజాయ్ చేద్దాం రండి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిహారికగౌడ్, వేణు, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, రమేష్‌చారి, శ్రీనివాస్, తిరుపతి, బాలు, శ్రావణ్, బాల్‌రెడ్డి, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన కోసం పోటాపోటీ నిరసనలు

- పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు
- నష్టపరిహారం చెల్లించాలని భూబాధితులు
- ఇరువర్గాల మధ్యన నలుగుతున్న ప్రయాణికులు



పరిహారం చెల్లించాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న భూబాధితులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులపై పోటా పోటీ నిరసనలు జరుగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తేవాలని స్థానికులు చేపట్టిన నిరసనలు నేటితో 20 రోజులకు చేరుకుంది. గతంలోను రోడ్డు విస్తరణలో కోల్పోయిన భూమికి నష్టపరిహారం, కొత్త చట్టం అనుసరించి నష్టపరిహారం చెల్లించాలని భూబాధితులు కోరుతున్నారు. కాని పదేళ్లుగా వంతెన పనులు కొనసాగడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకసారి గేటు పడితే తిరిగి గేటు తెరవాలంటే అర్థ గంట, ముప్పావుగంట సమయం పడుతోంది. కొందరు వంతెన త్వరగా నిర్మించాలని, మరికొందరు బాధితులకు నష్టపరిహారం చెల్లించాకే పనులు చేయాలని, అప్పటి వరకు పనులు చేయకూడదని నిరసన చేపట్టారు. ఇరువర్గాల కారణంగా ప్రయాణికులు, స్థానికులు నరకం చవిచూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించవలసిన వంతెన పనుల్లో కేంద్రం చేయవలసిన పనులు పదేళ్ల క్రితమే పూర్తి చేయగా, రాష్ట్ర ప్రభుత్వ పనులు మిగిలి ఉన్నాయి.

పనులు పూర్తి చేయాలంటూ జేఏసీ నిరసనలు

పదేళ్ల పైగా కొనసాగుతున్న వంతెన పనులు పూర్తి చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలు చేపట్టి 20 రోజులైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

చేస్తున్నారు. వంతెన పనులు పూర్తి చేసే వరకు, ఉన్నతాధికారులు హామి ఇచ్చేంత వరకు రిలే నిరహార దీక్షలు ముగించేది లేదని జేఏసీ నాయకులు పట్టుబడుతున్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

1997లో చేసిన రోడ్డు విస్తరణలో సుమారు 10–15 ఫీట్లు భూమి కోల్పోయినందుకు 60 గజాల పట్టా ఇచ్చి స్థలం చూపించలేదని అంటున్నారు. 100 ఫీట్ల రోడ్డు విస్తరించేందుకు తిరిగి నోటిఫికేషన్ జారీ చేశారు. 2013 చట్టం ప్రకారం మూడింతల నష్టపరిహారం చెల్లించాలని, ఇంటి స్థలం కేటాయించాలని కోరుతున్నారు. 125 మంది బాధితులు ఉండగా 25 మంది నష్టపరిహారం తీసుకోగా, 10 మంది కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికైన నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వంతెన పనులు పూర్తి చేయించాలని భూబాధితులు కోరుతున్నారు.

అత్యవసర సమయంలో ఇబ్బంది అవుతోంది



కొండాపూర్ నుంచి ఘట్‌కేసర్‌కు రావాలంటే తలనొప్పిగా మారింది. వంతెన కారణంగా వైద్యం కోసం వెళ్లేవారు, అత్యవసర సమయంలో అంబులెన్స్ రావడానికి ఆలస్యం అవుతోంది. త్వరగా వంతెన పనులు పూర్తి చేయించాలి.

– రేసు లక్ష్మారెడ్డి, వంతెన బాధితుడు

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



వంతెన పనుల ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇప్పటికైన ప్రభుత్వం వంతెన నిర్మించడంతో పాటు, భూబాధితులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలి.

– సార శ్రీనివాస్‌గౌడ్, భూబాధితుడు

ప్లాటు ఇస్తామని పొజిషన్ చూపలేదు..



గతంలో రోడ్డు విస్తరణ సమయంలో నష్టపరిహారం చెల్లించకుండా మోసం చేశారు. ప్రస్తుతం వంతెన కోసం 100 ఫీట్లకు రోడ్డు వెడల్పు చేస్తుండడంతో ఉపాధి కోల్పోతున్నాం. గతంలో ప్లాటు ఇస్తామని పట్టా ఇచ్చి నేటికి పొజిషన్ చూపలేదు.

– లక్ష్మీనారాయణ, భూబాధితుడు

డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అందజేయాలి

ఘట్‌కేసర్: డ్రైవర్లుకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీ గట్టుమైసమ్మ తల్లి ట్రాలీ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా బాధ్యుడు నర్సింగ్‌రావు, జిల్లా నాయకురాలు సబిత మాట్లాడుతూ.. డ్రైవర్లపై ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని, ప్రైవేటు యాప్స్ ఆపించి ప్రభుత్వ యాప్స్ అమలు చేయాలని, పార్కింగ్ స్థలం కేటాయించాలని, రెండు పడకల ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.



నిరసన చేపట్టిన డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవల్లో అంతరాయం

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలోని ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవల్లో ఈ నెల 28 నుంచి 31 వరకు అంతరాయం కలుగుతుందని బ్యాంకు మేనేజర్ సాయికుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులో విలీనం అవుతుండడంతో బ్యాంకు కార్యాచరణ కారణంగా బ్రాంచ్ బ్యాంకింగ్, ఏటీఎం, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర సేవలో ఈ నెల 28 నుంచి 31 వరకు అంతరాయం కలుగుతుందని ఖాతాదారులు సహకరించాలని మేనేజర్ కోరారు.

కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

జవహర్‌నగర్: పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగంపై గౌరవం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లావణ్యసతీష్‌గౌడ్, వేణు, సాయి, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు వినయ్‌కుమార్, భాస్కర్, రమేష్‌చారి, వెంకటేష్, లత, ధనమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.,



కేంద్రమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ తదితరులు

పరిశోధనలే భవిష్యత్తు



సదస్సులో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్యక్షులు డా. బాలకిష్టారెడ్డి తదితరులు

కీసర: శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి పరిశోధనలే ఊపిరి పోస్తాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షులు డాక్టర్ బాలక్రిష్టారెడ్డి అన్నారు. గురువారం చీర్యాలలోని గీతాంజలి సాంకేతిక కళాశాలలో నిర్వహిస్తున్న 3వ అంతర్జాతీయ మల్టీ ఫంక్షన్ మెటీరియల్ ప్రారంభోత్సవ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు పరిశోధనలలో చురుకుగా పాల్గొనాలని, వారి పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెఎన్‌టీయుహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ జెమ్స్‌రాజ్, కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, పిన్సిపాల్ డా. ఉదయ్‌కుమార్, సదస్సు కన్వీనర్లు నీరజరాణి, అంజయ్య, రాజు కళాశాల ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ అవార్డు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి 'చేంజ్ మేకర్స్ కాంక్లేవ్' అవార్డు దక్కింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 2021–2024 వరకు స్వచ్ఛ కార్యక్రమాలు, చెత్తతో నూతన వస్తువుల తయారీ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను అమలు చేయడంతో అవార్డు వరించింది. ఢిల్లీలో గురువారం జరిగిన సిల్వర్ హాక్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో డాక్టర్ సునీత చేతుల మీదుగా మున్సిపల్ స్వచ్ఛ్ సర్వేక్షన్ ఇన్‌చార్జి యోగీశ్వర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి అవార్డు దక్కడం అభినందనీయమని, కౌన్సిల్



ఢిల్లీలో చేంజ్ మేకర్స్ అవార్డు స్వీకరిస్తున్న యోగీశ్వర్

సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు శ్రమ, నాయకుల ప్రోత్సాహంతో అవార్డు దక్కిందన్నారు.

అభినందనలు

కీసర: హకింపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ నెల 17, 18 తేదిల్లో జరిగిన 400 మీటర్ల రన్నింగ్ పోటీలలో మేడ్చల్ జిల్లాస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని గగన ప్రియను గురువారం పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేంజ్ మేకర్‌గా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి ఎంపిక



పోచారం: సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ నిర్వహించిన చేంజ్ మేకర్స్ ఈవెంట్‌లో తెలంగాణ నుంచి పోచారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి కుమారి చేంజ్ మేకర్‌గా ఎంపికయ్యారు. ఢిల్లీలోని సిల్వర్ ఓక్ హాల్ ఇండియన్ హ్యాబిటాట్ సెంటర్‌లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ అధికారి రూపమిత్ర చేతుల మీదగా బహుమతి తీసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఆంథోని రాస్

జవహర్‌నగర్: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో అర్ధరాత్రి బయటకు వెళ్లిన భర్త అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్ హనుమాన్ టెంపుల్ వద్ద నివసించే ఆంథోని రాస్ (55) తన భార్య మారీస్‌కు ఈ నెల 18న రాత్రి గొడవ జరిగింది. దీంతో ఆంథోనీ రాస్ తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం తెలిసిన చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

పోచారం: లింగాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బెంగళూరు వెళ్లి అదృశ్యమైనట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండల పరిధిలోని లింగాపూర్ ప్రాంతానికి చెందిన కాసుకుంట్ల ప్రసాద్ (40) కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12న బెంగళూరులో ఓ వ్యక్తి నుంచి కారు, కొంత నగదు తీసుకురావడానికి వెళ్తున్నట్లు భార్య లక్ష్మికి చెప్పి వెళ్లాడు. ఈ నెల 15న భార్యకు వీడియో కాల్ చేసి తన ఫోన్ సరిగా పనిచేయడంలేదని, రిపేర్ చేయించిన తర్వాత మాట్లాడతానని చెప్పాడు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లోనే ఉండడంతో భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన బాటలో విద్యార్థులు

పోచారం: యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నుంచి జరగాల్సిన పరీక్షలకు ఫీజు చెల్లించని బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను అనుమతించలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందని, ఈ నేపథ్యంలో ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని స్పష్టం చేయడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. వీరికి మద్దతుగా ఏబీవీపీ నాయకులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పరీక్షలను సోమవారంకు వాయిదా వేశారు. శ్రీనిధి విద్యాసంస్థల చైర్మన్ కే.టీ.మహి విదేశాల్లో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాత ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియజేస్తామని ప్రిన్సిపాల్ శివారెడ్డి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



శ్రీనిధి కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జీవన ప్రమాణాలపై అవగాహన



జీవన ప్రమాణాలు, వికాసం పుస్తకాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ లలిత కళల మల్కాజిగిరి పాఠశాలలో విద్యార్థినులకు ''వాయిస్ 4 గర్ల్స్'' సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు, సంస్థ ప్రతినిధులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, రుతుక్రమం, ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు తదితర అంశాల పై అవగాహన కల్పించారు. అలాగే ''బాయ్స్ 4 చేంజ్'' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జీవన ప్రమాణాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాయ్స్ 4 చేంజ్ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు



మేడ్చల్‌లో.. అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: కాలనీలను అభివృద్ధి పరుస్తూ మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో సుమారు 15 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు లావణ్యశ్రీనివాస్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు సత్తయ్య, నాగార్జున, వేణుగోపాల్, జంగారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులోని విష్ణుపూరి కాలనీలో 6.5 లక్షల మున్సిపల్



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు తదితర అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ కౌన్సిలర్ అనితాసుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మల్లారెడ్డి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు గణితమే ప్రధానం

పోచారం: ప్రపంచంలో అందరూ ఏదో ఒక రూపంలో గణితం వాడుతున్నారని ఎస్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డా. సీవీ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'జాతీయ గణిత దినోత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాలలో జరుగుతున్న పరిశోధనలకు గణితమే ప్రధాన్యత వహిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా 'ఇంజనీరింగ్‌లో గణితశాస్త్రం యొక్క పాత్ర' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీ జరిగింది. పోటీలో 58 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి. నిర్మాణ విశ్లేషణ, కృత్రిమ మేధ, గూఢ లిపి శాస్త్రం వరకు ఇంజనీరింగ్ అనువర్తనాలతో గణిత



గణితశాస్త్ర పోస్టర్లను తిలకిస్తున్న ఎస్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

సూత్రాల ప్రాముఖ్యతను తెలిపే పోస్టర్లను సృజనాత్మకంగా ప్రదర్శించారు. హెచ్అండ్ఎస్ విభాగాధిపతి డా. చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతపడిన క్యాంటీన్

కీసర: నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్ట ఆలయానికి ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో యాత్రికులు రావడం జరుగుతుంది. యాత్రికులు స్వామి దర్శనానంతరం కుటుంబ సమేతంగా ఆలయం దిగువన ఉన్న హుడాపార్కులో సేదతీరేందుకు ఇష్టపడుతారు. ఈ నేపథ్యంలో యాత్రికుల కోసం క్యాంటీన్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్కుతోపాటు, క్యాంటీన్ నిర్వహణ, బాధ్యతను దేవస్థానంకు అప్పగించారు. దేవస్థానం క్యాంటీన్ నిర్వహణ నిమిత్తం టెండర్ వేసి సురేష్ అనే వ్యక్తికి ఏడాదిపాటు లీజ్‌కు ఇచ్చింది. కానీ క్యాంటీన్ లీజ్‌కు తీసుకున్న వ్యక్తి గత కొన్ని నెలలుగా క్యాంటీన్ ఓపెన్ చేయకపోవడంతో కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్వామి దర్శనానంతరం కుటుంబ సమేతంగా పార్కులో సేదతీరి కాఫీ, టీ, టీఫిన్స్ చేయాలంటే క్యాంటీన్ మూసి ఉండటంతో భక్తులు నిరాశగా వెనుదిరగాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇంత పెద్ద ఆలయం వద్ద లక్షలు వెచ్చించి నిర్మించిన క్యాంటీన్‌ను ఎందుకు కొనసాగించడం లేదో అధికారులకే తెలియాలని భక్తులు వాపోతున్నారు. ఇదే విషయమై ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం మాట్లాడుతూ.. క్యాంటీన్‌ను లీజ్‌కు తీసుకున్న వ్యక్తిని పిలిపించి యాత్రికులకు క్యాంటీన్ అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపడుతామన్నారు.



అనుభవజ్ఞులతోనే సంస్కృతి టౌన్‌షిప్‌నకు మేలు



ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న అధ్యక్ష అభ్యర్థి హరిప్రసాదరావు

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక కోసం ఈ నెల 22న ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేయనున్న హరిప్రసాదరావు గురువారం పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులతోనే టౌన్‌షిప్‌వాసులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా కేవలం టౌన్‌షిప్ అభివృద్ధి కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తన ప్యానల్ గెలుపొందితే టౌన్‌షిప్‌లో శాశ్వత వాణిజ్య భవన సముదాయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని పార్టీల మద్దతుతో ఎన్నికల్లో తన ప్యానల్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఉపాధ్యక్షుడుగా సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారిగా రజనికాంత్, కార్యవర్గ సభ్యులుగా పోరెడ్డి వెంకట్‌రెడ్డి, సరిత, ప్రతిభ, జోగేశ్వరరావు, ప్రగతి, కొండయ్య, శ్రీనివాస్, మంజుల పోటీ చేస్తున్నారన్నారు. అనంతరం ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. సమావేశంలో కౌన్సిలర్ బాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు దాసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.